www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 25 | ఏప్రిల్ | 2025
పేజీలు 7

## మామిడి పండ్ల మార్కెట్‌ను వినియోగించుకోవాలి



-సహజ సిద్ధంగా పండిన మామిడి పండ్ల విక్రయం
-వివిధ సీజన్‌లలో వచ్చే పండ్లను మార్కెట్‌లో విక్రయించేలా చర్యలు
-ఖమ్మం నగరంలో మామిడి పండ్ల మార్కెట్‌ను ప్రారంభించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

2 లో

# పాతికేళ్ల ప్రస్థానం.. పదేళ్లు అధికారం..!



### -ఎత్తు పల్లాలను చవిచూసిన బి(టి)ఆర్ఎస్
### -27న రజతోత్సవ సంబురం

**ప్రజాపక్షం/ఖమ్మం :** రాజకీయాల్లో బలమైన వాదం, సిద్దాంతంతో పాటు ప్రజలను ఆకర్శించగలిగిన శక్తి అవసరమే. పార్టీల పుట్టుకలోనూ ఒక బలమైన వాదం ఉంటేనే ఆ పార్టీలు పది కాలాల పాటు మనగలుగుతాయి. నాడు తెలుగుదేశమైనా, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర సమితియైనా రెండు ఒక బలమైన ప్రాంతీయ వాదంతో నిలబడి అధికారంలోకి వచ్చాయి. తెలుగు వారి ఆత్మగౌరవ నినాదాన్ని నాడు తెలుగుదేశం అధినేత ఎన్‌టిఆర్ అందుకుంటే తెలంగాణ వాదాన్ని కేసిఆర్ ఎత్తుకున్నారు. కాకపోతే నెలల్లోనే అధికార సాధన తెలుగుదేశానికి సాధ్యమైంది కానీ టిఆర్ఎస్ అధికారంలోకి రావడానికి 13 ఏళ్లు పట్టింది. కాకపోతే రాష్ట్ర సాధన అధికారంలోకి రావడం ఒకే సారి జరిగాయి. ఒక లక్ష్య సాధన కోసం పార్టీని ఏర్పాటు చేసి ప్రజలను తన వైపుకు తిప్పుకోవడంలో సఫలీకృతుడైన నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆయనకు గల ప్రజా సమ్మోహన శక్తి తెలంగాణ వ్యతిరేకులను సైతం ఆలోచింపజేసింది. వాదాన్ని ఎత్తుకోవడమే కాదు

మిగతా 2లో..



# ప్రారంభం కాని ఇసుక క్వారీలు..!

- అమ్మకానికి పెట్టిన టిఎస్ఎండిసి
- అయోమయంలో ఇసుక కొనుగోలుదారులు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం/చర్ల :** రాష్ట్ర ప్రభుత్వ ఇసుక కొరత దృష్ట్యా పది జిల్లాల్లో టిఎస్ఎండిసి ద్వారా ఇసుక క్వారీల్లో ఇసుక అమ్మకాలు ప్రారంభించింది. జిల్లాలో గిరిజన సొసైటీల ద్వారా టిఎస్ ఎండిసి ఇసుక అమ్మకాలు త్వరలో చేపట్టనుంది. విచిత్ర మేమిటంటేఇంకా ప్రారంభం కాని ఇసుక క్వారీలకు టిఎస్ఎండిసి శాఖ అధికారులు అత్యుత్సాహంతో గత పది రోజుల నుండి ప్రతి రోజూ జిల్లాలోని 9 ఇసుక ర్యాంపుల్లో సుమారు 43 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక అమ్మకానికి ఉందంటూ రాష్ట్ర ప్రభుత్వం టిఎస్ఎండిసి అధికారిక వెబ్‌సైట్లో ఉంచింది. ఇసుక అవసరాలు ఉన్న కొనుగోలుదారులు ప్రతి రోజు వెబ్‌సైట్ చూసి ఇసుక కొనుగోలు కోసం ప్రయత్నించి విఫలమతున్నారు. కొనుగోలు దారులు అధికారుల చర్యలపట్ల అయోమయానికి గురవుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అనంతారం సొసైటీలో 5వేల క్యూబిక్ మీటర్లు, అన్నారం లో 5వేలు క్యూబిక్ మీటర్లు, వీరాపురం లో 5 వేలు, పద్మగూడెంలో 5వేలు, విజనగరం 2 లో 8వేలు, వీరాపురంలో 8వేలు, మొగళ్లపల్లిలో 3వేలు, తేగడలో 3వేలు,

మిగతా 2లో..

ప్రతిభ ఉన్న చోటే ఘన విజయాలు... ప్రణాళిక ఉన్న చోటే విజేతలు...
2025 ఇంటర్ ఫలితాలలో స్టేట్ ఫస్ట్ మార్కులతో రుజువైంది
'శ్రీ నలంద'కు ఎదురే లేదని...

Jr. MPC 467 / 470 T. PRAVALIKA H.T. 2544100793

Jr. BiPC 436 / 440 T. MYTHRI H.T. 2544102525

Jr. MEC 487 / 500 G. RANGA LAHARI H.T. 2544100801

Sr. MPC 994 / 1000 LIKKI VISHRUTH H.T. 2544200837

Sr. BiPC 993 / 1000 T. JHANSI H.T. 2544200079

Jr. CEC 485 / 500 B. KHUSHITHA H.T. 2544102116




బాల బాలికలకు వేర్వేరు క్యాంపస్‌లు
క్యాంపస్‌లోనే హాస్టల్ వసతి
ఈ ఫలితాలన్నీ ఒకేఒక్క బ్రాంచి
కొత్తగూడెం శ్రీ నలంద నుండే...
జూనియర్ ఇంటర్‌లో 420కి పైగా సాధించిన విద్యార్థులు 350 మంది

SRI NALANDA JUNIOR COLLEGE
శ్రీ నలంద జూనియర్ కాలేజ్
కొత్తగూడెం
M.P.C With IIT (Mains & Advanced) EAMCET & Regular | Bi.P.C With NEET EAMCET & Regular | MEC & CEC
+91 9581214111 / 9949885510 / 7702877131

# పాతికేళ్ల ప్రస్థానం.. పదేళ్లు అధికారం..!

(మొదటిపేజీ తరువాయి)

ఆ దిశగా ప్రజలను కార్మోన్ముఖులను చేయడంలోనూ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసిఆర్) సఫలీకృతులయ్యారు. 2001లో తెలుగుదేశానికి ఉప సభాపతికి ఎంఎల్ఎ పదవికి రాజీనామా చేసి ఏప్రిల్ 27న జల దృశ్యంలో తెలంగాణ రాష్ట్ర సమితిని ఏర్పాటు చేశారు. తనదైన శైలిలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించడంలోనూ భావోద్వేగాలను సృసించడంలోనూ కేసిఆర్‌కు కేసిఆరే సాటి. 13 ఏళ్ల పాటు తెలంగాణ రాష్ట్ర సాధనకు వినూత్న కార్యక్రమాలతో వాదాన్ని నిలబెట్టడంతో పాటు ప్రజల్లో ఆశను సజీవంగా ఉంచారు. రాజకీయంగా ఆ 13 ఏళ్లలో ఎత్తు పల్లాలను చూసిన టిఆర్ఎస్ తెలంగాణ రాష్ట్ర సాధన ప్రకటన తర్వాత అధికారాన్ని సొంతం చేసుకోగలిగింది. 2004లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని రాష్ట్ర, కేంద్ర మంత్రి వర్గంలో చేరిన ఎక్కువ కాలం ఉండలేకపోయారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో రాజీనామాల పర్వం కొనసాగింది. ఆ తర్వాత 2009లో మహా కూటమిలో చేరింది. తెలంగాణ రాష్ట్ర సాధనకు వ్యతిరేకంగా ఉన్న బలమైన నాయకుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణం తర్వాత కేసిఆర్ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేశారు. అమరణ దీక్షతో పాటు పలు కార్యక్రమాల ప్రజా మద్దతుతో విజయవంతం కావడంతో అప్పటి కేంద్ర పాలకులు తెలంగాణ పట్ల సానుకూలంగా స్పందించారు. సిపిఐ తెలంగాణకు బహిరంగ మద్దతును ఇవ్వడమే కాకుండా పోరాటాల్లో పాల్గొనడం బిజెపి మద్దతు తెలంగాణ ఏర్పాటుకు సానుకూలంగా మారాయి. 13 ఏళ్ల పాటు తెలంగాణ ప్రజలను తన సమ్మోహన శక్తితో నడిపించిన కేసిఆర్ అధికారంలోకి రాగానే తన పద్ధతిని మార్చుకున్నాడు. టిఆర్ఎస్ ఉద్యమ పార్టీ కాదని రాజకీయ పార్టీ అని ప్రకటించిన కేసిఆర్ కొన్ని పథకాలతో ప్రజలను ఆకట్టుకున్నారు. ముఖ్యంగా రైతుబంధు, పింఛన్ పెంపు, రైతు బీమా, రైతులకు ఉచిత విద్యుత్, 24 గంటలు కరెంటు, అంతర్గత రోడ్లకు ప్రాధాన్యత, జిల్లాల పునర్విభజన, కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ తదితర కార్యక్రమాలు, పథకాలతో ప్రజలను ఆకర్షించారు. మొదటి దఫాలోనే కొంత వ్యతిరేకత ఏర్పడిన కేసిఆర్ తెలంగాణ వాది తెలంగాణను సాధించిన వ్యక్తి అన్న భావన తెలంగాణ ప్రజల్లో ఉంది. కేసిఆర్ భాష ముఖ్యమంత్రి కాక ముందు అస్వాదించిన తెలంగాణ ప్రజలు ఆ తర్వాత క్రమంగా తప్పుపట్టడం ప్రారంభించారు. విపక్ష కాంగ్రెస్‌ను చీల్చాడు. గెలిచిన వారిని గెలిచినట్లు తనలో చేర్చుకుని బలహీన పర్చాడు. కేసిఆర్ అధికారంలో ఉన్నన్ని రోజులు బిజెపి మిత్ర పక్షమో, శత్రుపక్షమో అర్థం కాని రాజకీయాలను నెర్పారు. పథకాలు తెలంగాణ వాదం కేసిఆర్ వ్యూహాత్మక రాజకీయాలు తిరిగి రెండోసారి టిఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకు వచ్చాయి. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసిఆర్‌లో మరింత అహంభావం పెరిగిందన్న ప్రచారంతో పాటు కుటుంబ పాలన అన్న విమర్శలకు టిఆర్ఎస్ సమాధానం చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. పదేళ్ల అధికారం పార్టీని ప్రజలకు దూరం చేసింది. ప్రభుత్వ పథకాలు జనామోదమే అయిన నేతల తీరు వ్యతిరేకతకు కారణమైంది. అదే సమయంలో కాంగ్రెస్ చావో, రేవో అన్న రీతిలో పోరాడటం బిఆర్ఎస్ వ్యతిరేక ఓటు కాంగ్రెస్‌కు మరలడం అన్నింటికి మించి టిఆర్ఎస్ నుంచి బిఆర్ఎస్‌గా మార్చడంతో తెలంగాణ వాదం నుంచి పార్టీ వెనుదిరిగిందన్న ప్రచారం ఓటమికి కారణమయ్యాయి. వీటితో పాటు కవిత కేసులు, ఫాం హౌజ్ ప్రచారాలు ఓటమిలో కొంత పాలు పంచుకున్నాయి. ఇప్పుడు అధికారం కోల్పోయి ఏడాదిన్నర కావస్తున్న సమయంలో రజతోత్సవ సంబురాలు జరుపుకుంటుంది. విపక్ష పాత్రలో కేసిఆర్ దాదాపు విఫలమైనట్లే. జన బాహుళ్యంలోకి రాకపోగా శాసనసభ సమావేశాలకు హాజరు కాలేదు. ఇండోర్ కార్యక్రమాలకే కేసిఆర్ పరిమితమయ్యారు. అధికారం కోల్పోయిన తర్వాత ప్రాంతీయ పార్టీల మనుగడ అంత తేలిక కాదు. దేశ వ్యాప్తంగా ఓటమి తర్వాత అనేక ప్రాంతీయ పార్టీలు కనుమరుగయ్యాయి. కానీ బిఆర్ఎస్ కాంగ్రెస్‌ను కాస్త దీటుగానే ఎదుర్కొంటుందని చెప్పవచ్చు. కాంగ్రెస్ ప్రచార వైఫల్యం బిఆర్ఎస్‌కు సానుకూలంగా మారింది. హరీష్‌రావు, కెటిఆర్ లతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నోరు ఉన్న పలుకుబడి కలిగిన నాయకులు బిఆర్ఎస్‌లో ఇప్పటికీ ఉండడం బిఆర్ఎస్‌ను చీల్చడం లేదా రాజకీయ ఇబ్బందులకు గురి చేయడం లేదా బలహీన పర్చడానికి కాంగ్రెస్ శక్తి సరిపోకపోవడం లేదా ప్రయత్నించకపోవడం తదితర అంశాలు ఇప్పటి బిఆర్ఎస్ స్థితికి కారణమవుతున్నాయి. అవునన్నాకాదన్న ప్రభుత్వంపై కాంగ్రెస్ పాజిటివ్ ప్రచారం కంటే బిఆర్ఎస్ నెగెటివ్ ప్రచారం ప్రజల్లోకి వెళ్తుంది. పాతికేళ్ల ప్రస్థానంలో అధికారాన్ని కోల్పోయి మళ్లీ బిఆర్ఎస్ అధికార పీఠం వైపు అడుగులేస్తుందా...? బిఆర్ఎస్ నేతల పోరాటాలు ప్రజల మద్దతును కూడగడతాయా, కేసిఆర్ సమ్మోహన శక్తి తిరిగి బిఆర్ఎస్‌ను అధికారం వైపు తీసుకెళ్తుందా వీటన్నింటికి భవిష్యత్తే సమాధానం చెప్పాల్సి ఉంది. ఏప్రిల్ 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే రజతోత్సవం తర్వాత పార్టీ ఏవిధంగా ముందుకు సాగుతుందన్నది వేచి చూడాలి.

# సాగు లాభాలు పెంచడమే లక్ష్యంగా పని చేయాలి



**-సేంద్రియ పద్ధతులపై రైతులు దృష్టి సారించాలి**
**-రైతు సదస్సులో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ప్రజాపక్షం/తల్లాడ :** యాజమాన్య పద్ధతులను అనుసరించి అధునిక సాగుతో రైతులకు లాభాలు పెంచడమే లక్ష్యంగా వ్యవసాయశాఖాధికారులు పని చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామంలోని రైతు వేదిక నందు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం వైరా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో నాల్గవ సంవత్సరం చదువుతున్న వ్యవసాయ విద్యార్థులు రైతులకు నూతన సాగు విధానంపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఎగ్జిబిషన్ విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు తిలకించారు. వారు నూతన సాగు పద్ధతుల గురించి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి అంటే కేవలం పరిశ్రమలు, ఉత్పత్తి రంగాలు మాత్రమే కాదని మనమంతా వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చామని వ్యవసాయాన్ని మరిచిపోతే మన అస్థిత్వం కోల్పోతామన్నారు. వ్యవసాయం ఉంటేనే మనకు ఆహార భద్రత ఉంటుందని 50 ఏళ్ల క్రితం దేశంలో ఆహార సంక్షోభం ఉండేదని ఇతర దేశాలు అందించే ధాన్యంపై ఆధారపడ్డామని వ్యసాయ విప్లవం తర్వాత దేశం ఆహార స్వాలంభన సాధించిందన్నారు. ఆహార సంక్షోభ ప్రమాదం వచ్చినప్పుడు అధునిక పద్ధతులలో వ్యవసాయపై దృష్టిసారించి ప్రస్తుతం దేశ అవసరాలకు మించి పండించే స్థాయికి చేరుకున్నామన్నారు. వ్యవసాయ విద్యార్థులు రాబోయే రోజుల్లో రైతులు మరిన్ని సేవలు చేయాలని, అన్నదాత అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడాలని సూచించారు. విద్యార్థులు రైతులతో మమేకమై కొత్త సాగు పద్ధతులు పాటించేలా దిగుబడి పెంచి నికర ఆదాయం వచ్చేవిధంగా ఎప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. వ్యవసాయ విద్యార్థులు రాబోయే రోజుల్లో వ్యవసాయ అధికారులుగా , శాస్త్రవేత్తలుగా వివిధ రంగాల్లో స్థిరపడాలని సూచించారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు చదువుకోవడానికి అనువైన వాతావరణం , విద్యార్థులు నేర్చుకోవడానికి అన్ని రకాల పంటలు సాగు చేస్తున్నామని విద్యార్థులు నేరుగా చూసి నేర్చుకోవడానికి అన్ని రకాల పద్ధతులను కళాశాలలో ఏర్పాటు చేశామని విద్యార్థులు అన్ని వసతులు ఉపయోగించుకుని మరింత బాగా చదివి రైతులకు సేవలు అందించాలని కోరారు. విద్యార్థులు, రైతులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం వైరా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కె. రవికుమార్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, హేమంత్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, తల్లాడ మండల తహసీల్దార్ సురేష్‌కుమార్, వ్యవసాయ అధికారి తాజుద్దీన్, విస్తరణ అధికారి త్రివేణి, మధుసూదన్‌రెడ్డి, ఝాన్సీ, శ్రవణ్, శాస్త్రవేత్త ఫణిశ్రీ, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

# సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు అధికారికంగా 67 టిఎంసిల కేటాయింపు

**-సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మాణానికి సాంకేతిక అనుమతులు**
**-డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క**

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మంజిల్లాలోని సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు 67 టిఎంసిలు కేటాయిస్తూ కేంద్రం అధికారికంగా నిర్ణయం తీసుకుందని దాంతో పాటు సీతమ్మ సాగర్ బ్యారేజ్ నిర్మాణానికి సాంకేతిక అనుమతులు మంజూరు చేసిందని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నం ద్వారా ఖమ్మంజిల్లాలోని వేల ఎకరాల బీడు భూములు సస్యశ్యామలం కానున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినటువంటి ఈ కార్యక్రమాన్ని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్రానికి స్పష్టమైన సమాచారం ఇప్పించి వారిని ఒప్పించి అధికారిక అనుమతులు సాధించారన్నారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ఉత్తమ్‌కుమార్‌ను అభినందించారు. భవిష్యత్తులో ఉమ్మడి ఖమ్మంజిల్లాలో పెద్ద ఎత్తున బీడు భూములు సాగు చేసుకునేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. దశాబ్దాల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం మూలంగా అధికారిక అనుమతులు సాధించడం అభినందనీయమన్నారు.

# ప్రారంభం కాని ఇసుక క్వారీలు..!

(మొదటిపేజీ తరువాయి)

కుదునూరు సొసైటీలో 3 వేలు కలిపి మొత్తం 4500 వేల క్యూబిక్ మీటర్లు స్టాక్ ఉన్నట్లు టిఎస్ఎండిసి అధికారిక వెబ్‌సైట్లో చూపిస్తున్నారు. వీటిలో చాలా వాటికి ఇసుక డిపింగ్‌యార్డుకుట్రాక్టర్లు వెళ్లేందుకు రహదారి తయారు కాలేదు. వీటికి పెద్దమొత్తంలో గ్రావెల్ అవసరం ఉండటంతో గ్రావెల్ తోలకాలకు రెవెన్యూ,మైనింగ్ అధికారుల అనుమతులు తప్పని సరీ. ఆ తర్వాత గిరిజనులకు ఉపాధికల్పించాలనే లక్ష్యంతో ఏర్పడిన ఇసుక సొసైటీల ద్వారా కూలీలను, ట్రాక్టర్లను మాట్లాడి గోదావరి నుండి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంటుంది. ఈ పనులన్నీ కాకముందే క్వారీల్లో ఇసుక స్టాక్ ఉన్నట్లు చూపించడంతో పలు అనుమానాలకు తావిస్తోందని కొనుగోలు దారులు, ప్రజలు విమర్శిస్తున్నారు. టిఎస్ఎండిసి అధికారులు దురుద్దేశ్యపూర్వకంగా రేజింగ్ కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. టిఎస్ఎండిసి అధికారుల అవకతకవలపై జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేయనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికైన మండల, జిల్లా అధికారులు స్పందించి సక్రమమైన రీతిలో ఇసుక క్వారీలు నడిపించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# మామిడి పండ్ల మార్కెట్‌ను వినియోగించుకోవాలి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రైతులు, వినియోగదారులు మామిడి పండ్ల మార్కెట్‌ను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం ఖమ్మం నగరం రోటరీ నగర్‌లో గల వీధి వ్యాపారుల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మామిడి పండ్ల మార్కెట్‌ను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం నగరం రోటరీ నగర్‌లో వీధి వ్యాపారుల ప్రాంగణంలో 30కు పైగా స్టాళ్లతో మామిడి పండ్ల మార్కెట్‌ను నూతనంగా ఏర్పాటు చేసుకున్నామన్నారు. మొదటి రోజు మూడు స్టాళ్లలో రైతులు పండ్ల విక్రయం చేపట్టారని, విస్తృత ప్రచారం కల్పించి రైతులు ఎక్కువ సంఖ్యలో విచ్చేసి మొత్తం స్టాల్‌లు నిండుగా పండ్ల వ్యాపారం జరిగేలా చూడాలని తెలిపారు. ఖమ్మం పరిసర మండలాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి మామిడి రైతులు ఇక్కడికి విచ్చేసి పండ్లు విక్రయిస్తారని కలెక్టర్ తెలిపారు. రైతులకు, వినియోగదారులకు ఉపయోగపడేవిధంగా మార్కెట్ అందుబాటులోకి వచ్చిందన్నారు. దళారులు లేకపోవడంతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. వినియోగదారులకు సహజ సిద్దంగా పండించిన కార్బైడ్ రహిత మామిడి పండ్లు అందేలా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. మామిడి పండ్ల మార్కెట్ మాత్రమే కాకుండా మామిడి సీజన్ ముగిసిన తర్వాత వివిధ సీజన్లలో వచ్చే ప్రత్యేకమైన పండ్లు జామ, సీతాఫలం, బొప్పాయి వంటి రైతులు నేరుగా ఇక్కడకు వచ్చి విక్రయించేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టర్ వ్యాపారులకు పండ్ల కవర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి ఎంవి. మధుసూదన్, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్, కార్పొరేటర్ నీరజ, ప్రజాప్రతినిధులు నల్లమల వెంకటేశ్వరరావు, మామిడి రైతులు పాల్గొన్నారు.

# ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేసి రైసుమిల్లులకు తరలించాలి : కలెక్టర్





**ప్రజాపక్షం/తల్లాడ :** కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైసుమిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ తల్లాడ మండలంలో పర్యటించారు. కుర్నవల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం బైక్‌పై ప్రయాణించి ఐకెపి ఆధ్వర్యంలో నడుస్తున్న కొనుగోలు కేంద్రంలో నిర్వహిస్తున్న రిజిస్టర్లు, ధాన్యం తేమశాతం, గన్నీ సంచుల లెక్కలను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ప్రతి కొనుగోలు కేంద్రంలో బోర్డు ఏర్పాటు చేసి ఇప్పటి వరకు టార్పాలిన్ పట్టాలు, గన్ని సంచులు ఎన్ని ఉన్నాయో స్పష్టమైన వివరాలు ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. నాణ్యమైనధాన్యానికి కూడా కోతలు విధించాలని ప్రయత్నిస్తే కొనుగోలులో సమస్యలు సృష్టించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ధాన్యం తరలింపు సమయంలో కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీ సమస్యలు రాకుండా ముందస్తుగా ప్లానింగ్ చేసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు అలాట్ చేసిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం తరలించాలని సూచించారు. రవాణా సమస్య రాకుండా అవసరమైన లారీలు కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డేటా ఎంట్రీ చేయాలన్నారు. ఈ తనిఖీల్లో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, తల్లాడ మండల తహసీల్దార్ సురేష్‌కుమార్, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

# తక్కువ ఖర్చుతో ఆధునిక వైద్యం మమత లక్ష్యం

**-75 సంవత్సరాల మహిళకు అరుదైన శస్త్ర చికిత్స**
**-మమత సంస్థల డైరెక్టర్ పువ్వాడ నరేన్**





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తక్కువ ఖర్చుతో ఆధునిక వైద్యం అందించడమే మమత వైద్య సంస్థల లక్ష్యమని మమత వైద్య విద్యా సంస్థల డైరెక్టర్ పువ్వాడ నరేన్ తెలిపారు. 75 సంవత్సరాల మహిళకు గైనకాలజీ విభాగంలో అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. గురువారం మమత జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డైరెక్టర్ పువ్వాడ నరేన్, డీన్ అనురాధ, సూపరింటెండెంట్ రామస్వామి, గైనకాలజీ హెచ్‌వోడి నైమిషా లతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా హెచోవోడి నైమిషా మాట్లాడుతూ పది రోజుల క్రితం ఖమ్మం మమత ఆసుపత్రికి సూర్యాపేట జిల్లా రంగాపురం గ్రామానికి చెందిన 75 సంవత్సరాల పి. సుశీల కడుపునొప్పితో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చిందని ఆమె తెలిపారు. ఆమెకు అన్ని రకాల వైద్య పరీక్షలను నిర్వహించి అండాశయంలో కణితి (నీటి బుడగ) ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆ కణితి వల్ల ఆమె తీవ్ర కడుపునొప్పితో పాటు ఇతర అవయవాలకు కూడా ఇబ్బందులు ఏర్పడ్డాయని ఆమె తెలిపారు. ఆమెకు ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్స నిర్వహించి సుమారు ఏడు కిలోల కణితిని తొలగించినట్లు ఆమె పూర్తిగా కోలుకుందని శుక్రవారం డిశ్చార్జ్ చేస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి శస్త్ర చికిత్సలకు పెద్ద పెద్ద నగరాల్లో రెండు లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుందని అటువంటి వైద్యాన్ని ఆరోగ్యశ్రీలో సుశీలకు ఉచితంగా అందించినట్లు తెలిపారు. ఈ శస్త్ర చికిత్సను హెచ్‌వోడి నైమిషా, ఇందు, హర్షిక , గీత బృందం, అనస్థీషియా హెచ్‌వోడి డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ శశాంక బృందం తదితరుల ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించినట్లు వారు తెలిపారు. డైరెక్టర్ పువ్వాడ నరేన్ మాట్లాడుతూ 25 సంవత్సరాల క్రితం స్థాపించిన మమత వైద్య సంస్థలు ఉమ్మడి ఖమ్మంజిల్లాతో పాటు చుట్టు పక్కల జిల్లాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందిస్తూ ప్రజల మన్ననలు పొందిందన్నారు. మారుతున్న పరిజ్ఞానానికి అనుగుణంగా అధునాతన సౌకర్యాలు కల్పిస్తూ పేదలకు తక్కువ ఖర్చుతో అత్యాధునీక వైద్యం మమతలో అందిస్తున్నట్లు తెలిపారు. పెద్ద పెద్ద నగరాలకే పరిమితమైన ఎన్నో క్లిష్ట తరమైన శస్త్ర చికిత్సలను కూడా తక్కువ ఖర్చుతో, ఆరోగ్యశ్రీలో మమతలో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మమతలో అన్ని విభాగాలలో నిష్ణాతులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని అన్ని రకాల శస్త్ర చికిత్సలు తక్కువ ఖర్చుతో అందిస్తున్నట్లు ఉమ్మడి ఖమ్మంజిల్లా ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# భూ భారతితో భూ సమస్యలకు పరిష్కారం

**భూ భారతి సదస్సులో డిఆర్‌వో పద్మశ్రీ**



**ప్రజాపక్షం/చింతకాని :** ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంతో భూ సమస్యలన్నింటినీ పరిష్కరించి భూ యజమానులు, రైతులు సంతోషంగా ఉండేలా రెవెన్యూ యంత్రాంగం కృషి చేస్తోందని డిఆర్‌వో పద్మశ్రీ తెలిపారు. చింతకాని మండలం నాగులవంచ లో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ భూములపై నెలకొన్న వివాదాలను పారదర్శకంగా పరిష్కరించేలా భూ భారతి అమలవుతుందని చెప్పారు. భూమి విలువ ఆధారంగా కలెక్టర్, ఆర్డీవో స్థాయిలో సమస్యలు పరిష్కరిస్తారని, రికార్డుల నిర్వహణ మెరుగవుతుందని తెలిపారు. ఈ మేరకు సదస్సులో రైతులు పాల్గొని తమ సమస్యలపైదరఖాస్తులు ఇవ్వాలని, సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్‌లో సంప్రదించాలని సూచించారు.తహసీల్దార్ అనంతరాజు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఏఐకేఎస్ చింతకాని మండల అధ్యక్షుడు దొబ్బల వెంగళరావు మాట్లాడుతూ ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకురావడం హర్షణీయమని అదే విధంగా భూనిర్వాసిత రైతులకు న్యాయం చేసే విధంగా సమస్యలు పరిష్కరించాలన్నారు. అదే విధంగా ప్రతి గ్రామంలో రైతు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు, ఏవో మానస, రైతు సంఘం జిల్లా నాయకులు ఏపూరి రవీంద్రబాబు,ఆత్మ కమిటీ డైరక్టర్లు కొప్పుల గోవిందరావు, తోటకూరి ప్రగతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, నాయకులు మడుపల్లి భాస్కర్, కిలారి మనోహర్ బాబు, నూతలపాటి వెంకటేశ్వర్లు, కంచుమర్తి రామకృష్ణ, సీపీఐ మండల సహాయ కార్యదర్శి దూసరి గోపాలరావు, ఆళ్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# బడిబాట కార్యక్రమంలో సింగరాయపాలెం ఉపాధ్యాయులు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని సింగరాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు కనకపూడి లక్ష్మీ నారాయణ పాఠశాల ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వం పిలుపు కంటే ముందుగానే బడిబాట కార్యక్రమాన్ని ప్రారంబించారు. నిన్న పాఠశాలలకు చివరి పనిదినం కాగా మరుసటిరోజునే బడిబాట కార్యక్రమం చేపట్టడం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ఉపాధ్యాయుల కృషి చేయడం గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించడం పట్ల పలువురు గ్రామపెద్దలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చుట్టప్రక్కల ఉన్న పది గ్రామాల్లో బడిబాట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడానికి ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులను నాలుగు టీమ్ లు గా చేసి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ఉపాధ్యాయులను బృందాలుగా విభజించారు. ఉపాధ్యాయులు మాధవి, ఆర్ పద్మ, ధశరధ్, బాస్కర్‌రావులు సిద్దిక్‌నగర్, సింగరాయపాలెం, అల్లీపురం, మరో టీమ్‌లో ఉపాధ్యాయులు చంద్రమోహన్, వెంకట్రావు, సుశీలారాణి, రజనీ లు తీగలబంజర, క్రాంతినగర్ గ్రామాల్లో ప్రయివేటు పాఠశాలల విద్యార్థులను వారి తల్లితండ్రులను కలుసుకొని హైస్కూల్ లో ఉన్న సౌకార్యాల గురించి వివరించారు. పిఎం శ్రీ పథకం కింద పాఠశాలలకు అనేక నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. పాఠశాలలో సకల సౌకర్యాలను ప్రధానమంత్రిశ్రీ పథకం కింద పొందుతున్నామని తెలిపారు. ప్రతిభావంతులైన ఉపాధ్యాయుల భోధనా పద్దతులద్వారా విద్యార్థులను క్రమశిక్షణతో అనేక నైపుణ్యాలను నేర్పుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని కోరారు. బాలికల తల్లితండ్రులు బస్సు సౌకర్యం ఉంటే పంపుతామని సైకిల్, ఆటోల మీద పంపలేమని చెప్పారు. ప్రభుత్వం రవాణా సౌకర్యం కల్పిస్తే ప్రభుత్వ పాఠశాలలకు పంపుతామని తల్లితండ్రులు తెలిపారు. ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటుందో వేచిచూడాలి మరి.

# రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి




**ప్రజాపక్షం/ మధిర :** రైతులు ప్రతి మూడు సీజన్లకోసారి భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయశాఖ ఎడిఎ విజయ చంద్ర తెలిపారు. గురువారం మండలంలోని మాటూరు క్లస్టర్ పరిధిలోని రైతులకు భూ సార పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఆరోగ్యానికి హెల్త్ చెకప్ ఎలానో మనం పంట పడించే భూమికి భూసా ర పరీక్ష కూడా అలాంటిదేనని అన్నారు. భూసార పరీక్ష వల్ల భూమిలో ఉండే పోషక విలువలు తెలుసుకోవచ్చునని, తద్వారా ఏ పంటలు వేసుకుంటే దిగుబడులు వస్తాయో తెలుసుకుని ఆ పంటను సాగు చేసే వీలవుతుందని తెలిపారు. అదేవిధంగా ఆయిల్ ఫామ్ పంట వలన కలిగే ఉపయోగాలను వివరించారు. అనంతరం డిజిటల్ గ్రీన్ ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో భూసార పరీక్షలు నిర్వహించి సాయిల్ హెల్త్ కార్డు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఓ సాయి దీక్షిత్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, ఎఈఓ నికిత, రైతులు, డిజిటల్ గ్రీన్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# గోడౌన్‌లను తనిఖీ చేసిన రాయల



**ప్రజాపక్షం/ మధిర :** ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని గోడౌన్‌లను రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధిర మండలంలోని దెందుకూరు, బోనకల్ మండలంలోని చిరునోముల గ్రామాల్లోని గోడౌన్‌లను వారు సందర్శించారు. గోదాముల్లో ఉన్న సన్న బియ్యం నిల్వలను పరిశీలించారు. గోడౌన్‌ల సామర్ధ్యంతో పాటు ఎంతమంది హమాలీలు ఉన్నారు లాంటి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిరునోముల గౌడోన్ ప్రాంగణంలో నెరేడు మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వెజెండ్ల సాయికుమార్, షేక్.జానిబాషా, మార్కెట్ డైరెక్టర్లు అనుమోలు వెంకటేష్, ఎర్రంశెట్టి సుబ్బారావు, షేక్. ఫారుక్ తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మధిర మండలంలోని చిలుకూరు, మడుపల్లి గ్రామాల్లో మండల పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. అనంతరం రైతులకు వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ టీకాల ప్రాముఖ్యతను తెలిపారు. సన్న, చిన్నకారు పశుపోషకులు పశువుల పెంపకం ద్వారా పాడితోనే ఆర్ధికంగా లబ్ధి పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్స్ రఫీఅహ్మద్, లక్ష్మణరావు, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్స్ కొండలరావు, కిరణ్, గోపాల మిత్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థులకు సన్మానం



**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** ఇటీవల విడుదలైన ఇంటర్మీడియేట్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం చేశారు. అశ్వారావుపేట మండలం తిరుమలకుంట గ్రామానికి చెందిన జుజ్జురి సాయిపద్మ ఎంపిసి ద్వితీయ సంవత్సరం నందు 987/1000 మార్కులు సాధించగా, బొల్లుకొండ లీలావరప్రసాద్ ప్రథమ సంవత్సరం సిఇసి నందు 477/500 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు మరింత ముందుకు సాగాలని, పట్టుదలతో చదివి మంచి ఉత్తీర్ణత సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని, భవిష్యత్‌లో మరెన్నో విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీమకుర్తి శ్రీను, కొత్తపల్లి సీతారాములు, బొల్లుకొండ చెన్నారావు, పల్లెల రామలక్ష్మయ్య, బొడ్డు సత్తిబాబు, కోసూరి నాగు, తరుణ్, సిద్దెల రాము, పానుగంటి చెన్నకేశవులు, శ్రీను పాల్గొన్నారు.

# పహల్గాం మృతులకు ఘన నివాళి




**ప్రజాపక్షం/ అశ్వారావుపేట:** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు నివాళులర్పించారు. గురువారం కళాశాల నుండి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి ఉగ్రవాదుల దాడిని ఖండించారు. ఇలాంటి సంఘటనలు జరగటం ఎంతో బాధాకరమని, ప్రతిఒక్కరూ ఉగ్రవాదుల దాడులను ఖండించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదుల దాడులను నియంత్రించి బాధిత కుటుంబాలను న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎఓ రాఘవరావు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, అనూష, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధి పని దినాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పని దినాలను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ జీ.నాగేంద్ర సూచించారు. మండలం లోని కోనాయిగూడెం గ్రామంలో గురువారం ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. మస్టర్ రికార్డులను పరిశీలించారు. కూలీలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూలీలు ప్రభుత్వం విధించిన నిబంధనలు ప్రకారం పనులు చేయాలని సూచించారు. ఇటీవల ప్రభుత్వం కూలీల వేతనాలు పెంచినట్లు తెలిపారు. పనులు కొలతలు ప్రకారం తప్పకుండా చేయటంతో పాటు, సమయ పాలన పాటించాలని సూచించారు. ఎండ తీవ్రత కు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి క్షేత్ర సహాయకుడు తిగుళ్ల భాస్కర్, వడ్లమూడి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, మేట్లు పాకనాటి సీతారామిరెడి కర బాలస్వామి, బిందె నరేష్ పాల్గొన్నారు.


## అత్యంత వైభవంగా విగ్రహాల ఊరేగింపు

-జలబిందెలతో మహిళలు భారీ ప్రదర్శన



ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండలంలోని భైరవునిపల్లిలో శ్రీ గంగ మ్మ తల్లి, పోతురాజుల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం లో భాగంగా గురువారం శ్రీ గంగమ్మ తల్లి, పోతురాజుల స్వామి విగ్రహాలు కు ఘనస్వాగతం పలికారు. మహిళలు ఆటా, పాటలతో గ్రామంలో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. శుక్రవారం నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ట కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు జలబిందెలతో బారీ ప్రదర్శన చేపట్టారు. ఓలింగా, జై గంగమ్మ నినాదాలతో గ్రామం మారుమోగింది. సాయంత్రం బలిహరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు జోస్యబోట్ల ప్రసాద్ శాస్త్ర, మాజీ సర్పంచ్ కనకబండి సీతారాములు, యాదవ్ సంఘం అధ్యక్షుడు కనకబండి రమేష్ యాదవ్, పెద్ద గొల్ల బాలిన నారాయణ, గొరెల పెంపకం కాపరుల సంఘం అధ్యక్షుడు మల్లెబోయిన ఉపేందర్ యాదవ్, కార్యదర్శి నూక వేంకటేశ్వరరావు, యాదవ్ సంఘం నాయకులు బోల్లం సత్యానారాయణ, కనకబండి కనకనాగరాజు, పొదిల లక్ష్మినారాయణ, బాలిన కృష్ణంరాజు, నూక హనుమంతరావు, మల్లేబోయిన శ్రీనివాస్ రావు, బాలిన కోటయ్య, చల్లా అప్పయ్య, చంద్రకాని మధు, బాలిన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/జూలూరుపాడు: జూలురుపాడు మండలం అన్నారుపాడు గ్రామం కు చెందిన బానోత్ హనుమా పద్మ ఆహ్వానం మేరకు వారి కుమార్తె మంజు శ్రీ వెడ్స్ రమేష్ ల వివాహ వేడుకకు వైరా నియోజకవర్గ శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ హజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పహాల్గాం ఘటనను ఖండిస్తున్నాం..




ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ : జమ్మూ కాశ్మీర్ పహాల్గాం పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిలో భారత పౌరులు మృతి చెందిన సంఘటన దేశం మొత్తం తీవ్ర దిగ్భ్రాంతికి లోనైందని మృతి చెందిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మౌనం పాటించి నివాళులు అర్పించారు. దేశ ఐక్యత శాంతి పరిరక్షణ ముఖ్యమని ఉగ్రమూకలను కఠినంగా శిక్షించాలని దేశంలో ఉగ్రవాదాన్ని అణిచివేయాలని శుక్రవారం అన్ని మసీదులలో పహాల్గం ఉగ్రదాడుల్లో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రత్యేక ప్రార్ధనలు జరపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నయీమ్ ఖురేషి, అబ్దుల్ రబ్, అధ్యక్షులు అమీర్ ఖాద్రి, ఆబిద్ హుస్సేన్, షరీఫ్ భాయ్, సయ్యద్ అన్వర్ అలీ, బాబు జానీ ఖాన్, రామవరం మస్జిద్ అధ్యక్షులు, అంకుష్, ఉస్మాన్, షమీయుద్దీన్, ఎండి జమాల్,ఖాజా ఉస్మాన్, హమీద్, తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతుల అభివృద్ధికి ప్రభుత్వ తోడ్పాటు

-సకాలంలో బిల్లులు చెల్లించేలా చర్యలు
-విజయ డెయిరీ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి







ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పాడి రైతుల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు నందిస్తుందని విజయ డెయిరీ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి తెలిపారు. గురువారం ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి ఖమ్మంలోని విజయ డెయిరీని సందర్శించారు. తొలుత ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ గ్రామంలో పాల సేకరణ కేంద్రం వద్ద రైతులతో ఛైర్మన్ అమిత్‌రెడ్డి ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన విజయ డెయిరీ పార్లర్‌ను ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, మంత్రి తుమ్మల తనయుడు తుమ్మల యుగంధర్, డిసిసి ప్రెసిడెంట్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల నరేందర్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం విజయ డెయిరీ ప్లాంట్‌ను ఛైర్మన్ సందర్శించి కంప్రెసర్, ప్యాకేజింగ్, కోల్డ్ రూమ్స్, బాయిలర్ తదితర వాటిని పరిశీలించి ఉద్యోగులతో ప్లాంట్ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం డెయిరీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఛైర్మన్ అమిత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. పాల ఉత్పత్తిదారులు, పాడి రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ సహకారంతో డెయిరీ కృషి చేస్తుందని ఆయన తెలిపారు. పాడి రైతులను ప్రోత్సహించేందుకు లీటరుకు ఐదు రూపాయలు ధర పెంచినట్లు ఆయన తెలిపారు. పాల బిల్లులు గత కొంత కాలంగా ఆలస్యంగా ఇస్తున్నామని బిల్లులు సకాలంలో అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఛైర్మన్‌ను ఇందిర మహిళ డెయిరీ బృందం కలిసి వారి సమస్యలను వివరించారు. విజయ డెయిరీకి పాల సేకరణ గతంలో కంటే మెరుగైందని మహిళ సంఘాల ద్వారా గణనీయంగా పాల సేకరణ పెరిగిందన్నారు. ఉప ముఖ్యమంత్రి ప్రోత్సాహంతో మధిర నియోజక వర్గంలో మహిళా సంఘాలకు ఇంటికి రెండు గేదెలను అందించనున్నట్లు ఛైర్మన్ తెలిపారు. పట్టణ స్థాయిలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా విజయ డెయిరీని విస్తరించనున్నట్లు తెలిపారు. మరిన్ని డెయిరీ పార్లర్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సొసైటీ రిజిస్ట్రేషన్‌కు పాడి రైతులు తీర్మానించగా ఛైర్మన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సిఅండ్ ఐ హైదరాబాద్ మధుసూదన్‌రావు, అడిషనల్ డిఆర్‌డివో నూరుద్దీన్, పాడి గణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ కొర్లకుంట నాగేశ్వరరావు, ఖమ్మం డిడి మోహన్‌మురళి, డెయిరీ మేనేజర్ మురళి కృష్ణ, డెయిరీ ఇంజనీర్ నాగమణి, హన్మంతు, సేల్స్ ఇంచార్జ్ కృష్ణ , అనితకుమారి, నాగశ్రీ, శ్రీలత, అప్పారావు, మురళికృష్ణ, భాస్కర్‌రావు, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కొండాపురం మైన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు ఏరియాలోని కొండాపురం మైన్ లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ మైన్ మేనేజర్ పి నరసింహారావుకి గురువారం ఏఐటియుసి ఆధ్వర్యంలో మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో బ్రాంచ్ సెక్రటరీ కామ్రేడ్ రాంగోపాల్ మాట్లాడుతూ గనిలో ఆర్ఓ వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదని క్యాంటీన్‌లో త్రాగునీటి సౌకర్యం కల్పించాలని, వాష్ రూమ్ లలో కనీస సౌకర్యాలు కల్పించాలని, వాటర్ సప్లై చేయాలని, మైనింగ్ స్టాఫ్, టెక్నీషియన్స్ రూమ్‌లలో ఉన్న సమస్యలు పరిష్కరించి ఆధునికరించాలని, మూడు షిఫ్టులలో విధిగా డ్రైవర్లను నియమించాలని, కార్మికులపై పని భారాన్ని తగ్గించాలని, మ్యాన్ రైడింగ్ సమస్యను పరిష్కరించాలని, సేఫ్టీ నిర్లక్ష్యం చేయడం వలన కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారని, కావున సేఫ్టీ గా పనిచేయించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, మ్యాన్ రైడింగ్ లో పనిచేస్తున్న టెక్నీషియన్స్ కి ప్లే డేలు కల్పించాలని, కార్మికులందరికీ లాకర్లు, కప్ బోర్డ్స్, గమ్ షూస్ ఇవ్వాలని, సేఫ్టీ కమిటీ, మైన్స్ కమిటీలలో ప్రస్తావించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అలాగే ఏఐటీయూసీ యాజమాన్యంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం జనరల్ మజ్దూర్లను జనరల్ అసిస్టెంట్లుగా మారుస్తూ యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసిందని ఇది కార్మికుల విజయంగా పేర్కొన్నారు. అనునిత్యం కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తూ కార్మికుల హక్కులను ఏఐటీయూసీ కాపాడుతుందని అన్నారు. ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ ఎం.వి.రాం నర్సయ్య, ఆఫీస్ బెరర్ ఆవుల నాగరాజు, ఫిట్ సెక్రటరీ ఆంతోని రవికుమార్, నాగేశ్వరరావు, ఈశ్వర్ రావు, అరుణ్ జంపయ్య, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి సభ్యత్వ కార్డులు పంపిణీ



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ కార్డులు అందజేత కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ కొండపల్లి రామచంద్రరావు పాల్గొని తెదేపా నాయకులకు బూతుల వారీగా నియోజకవర్గంలో గల నాయకులకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో రికార్డ్ స్థాయిలో సభ్యత్వాలు నమోదు చేపట్టడం జరిగిందని, ప్రజలు చంద్రబాబు నాయుడు నాయకత్వంపై విశ్వాసం ఉంచి తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోవడం అభినందనీయమని తెలిపారు. సభ్యత్వం తీసుకున్న తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరికీ పేరుపేరునా తెలుగుదేశం పార్టీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండల, పట్టణ, గ్రామ, వార్డు స్థాయిలో గల నాయకులందరూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణీని పండుగ వాతావరణంలో ప్రతి ఒక్కరికి పంపిణీ చేయాలని ఆయన కోరారు. పార్టీ సభ్యత నమోదు తీసుకున్న ప్రతి ఒక్కరికి 5 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ నేత వట్టం నారాయణ దొర, మండల నాయకులు మల్లిడి లోకేష్, ఉప్పలపాటి రాంబాబు, రాజా, ముమ్మినేని సత్యానారాయణ, పూర్ణ, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, బచ్చల సుమేష్, పొగాకు వెంకటేశ్వర్లు, మల్లయ్య, మహిళా నేతలు ఖమురున్నీసా బేగం, విజయలక్ష్మి పాల్గొన్నారు.

# డిజిపిఎస్ సర్వేతో నూతన భూ కొలతలు

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్





ప్రజాపక్షం/నేలకొండపల్లి : ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన భూ భారతి చట్టం చట్టంతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని జిల్లా కలెక్టర్ ముజమ్మిలాఖాన్ అన్నారు. మండలంలోని ముజ్జుగూడెంలో గురువారం నిర్వహించిన రెవిన్యూ సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. భూమి స్వభావం, కొలతలు ఎక్కడ ఉంది తెలితేనే భూ సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని అన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని భూ భారతి చట్టం ను ప్రవేశపెట్టిందని అన్నారు. 1910 నుంచి 1930 వరకు నైజాం కాలంలో భూ సర్వే జరిగిందని అన్నారు. భూ సమస్యల పరిష్కారం సర్వేతోనే సాధ్యమని అన్నారు. జీపీఎస్ సాంకేతికతతో కూడిన యంత్రాలతో సర్వే చేపటం జరుగుతుందని ప్రతీ గ్రామానికి సర్వేయం సర్వేతోనే సాధ్యమని అన్నారు. జీపీఎస్ సాంకేతికతతో కూడిన యంత్రాలతో సర్వే చేపట్టం జరుగుతుందని ప్రతీ గ్రామానికి సర్వేయర్ల ను కేటాయించి సర్వే పూర్తి చేస్తామని, మండలంలోని సర్వేయర్ సర్వే సరిగా జరిగినట్లు ధృవీకరణ జరుపుతారని అన్నారు. భూమి కొలతలు, ఎక్కడ ఉందో తెలిసిన తరువాత యాజమాన్యం హక్కు తేల్చాల్సి ఉంటుందని అన్నారు. ఖమ్మం జిల్లాలో దాదాపు లక్షకు పైగా సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, వీరికి పట్టాలు అందించేందుకు భూ భారతి చట్టం సౌలభ్యం కల్పించామని అన్నారు. వారసత్వ భూములకు రిజిస్ట్రేషన్ మ్యూటేషన్ చేసే ముందుతప్పనిసరిగా కుటుంబ సభ్యులందరికి నోటీసులు జారీ చేయాలని, తరువాత మాత్రమే భూ హక్కుల బదలాయింపు జరగాలని కొత్త చట్టం చేర్చుకున్నామని, దీని వలన వివాదాలకు తావు లేకుండా ఉంటుందని అన్నారు. భూ హక్కుల రికార్డులలో తప్పులు జరిగితే అప్పీల్ చేసుకునేందుకు గతంలో సివిల్ కోర్టు కు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, భూ భారతి చట్టం ప్రకారం రెవిన్యూ కోర్టులకు ప్రవేశపెట్టిందని అన్నారు. నిర్దేశిత సమయంలో ప్రజలకు సేవలు అందేలా చట్టంలో అధికారుల పై బాధ్యత పెట్టిందని అన్నారు. భూ హక్కుల రికార్డు మ్యూటేషన్ దరఖాస్తులను 30 రోజుల లోగా పూర్తి చేయాలని, చేయని పక్షంలో దరఖాస్తు ఆటోమేటిక్ గా అమోదం పొందుతుందని అన్నారు. ఈ సదస్సులో భూ భారతి చట్టం పై అడ్వకేట్ సునీల్ పలు అంశాల పై వివరించారు. రైతులు వివిధ అంశాల పై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. . సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి, తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ సంఘం సభ్యులు, అడ్వకేట్ సునీల్, ఖమ్మం ఆర్డీవో నరసింహారావు, పాలేరు ప్రత్యేకాధికారి రమేష్, ఏడీఏ బీ.సరిత, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో యం.యర్రయ్య, ఏవో యం.రాధ తదితరులు పాల్గొన్నారు.

# మేడే సాక్షిగా సమస్యల పరిష్కారానికి ప్రతినబూనుదాం



ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ : ప్రపంచ కార్మికుల పర్వదినం మేడే సాక్షిగా సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిస్కారం కోసం, కార్మికుల హక్కుల పరిరక్షణకోసం పోరాడతామని ప్రతినబూనాల్సిన అవసరం ఏర్పడిందని, భవిష్యత్తులో జరుగబోయే పోరాటాలకు కార్మికవర్గం సిద్ధంగా ఉండాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ కార్యదర్శి వంగవెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.వీరాస్వామి పిలుపునిచ్చారు. 139వ మేడే సందర్భంగా యూనియన్ ప్రచురించిన డిమాండ్ల గోడ ప్రతిని గురువారం ఏఐటీయూసీ కార్యాలయం శేషగిరిభవంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నూతన బొగ్గుగనుల ప్రారంభించాల్సిన అవసరం ఉందని, బొగ్గు వెలికితీత పనుల్లో ప్రేవేటి కార్మికులను నియమించే విధానాన్ని యూనియన్ వ్యతిరేకిస్తుందన్నారు. సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల సవరణ, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 40వేల కోట్లను తక్షణమే తిరిగి సంస్థకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో మేడేను జరపాలని, బొగ్గుగనుల, ఉపరితల విభాగాల్లో మేడే జెండాలను ఆవిష్కరించాలను కోరారు. సమావేశంలో నాయకులు ఎస్వి రమణమూర్తి, మల్లయ్య, రాజేశ్వరరావు, మాచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో సమగ్ర అభివృద్ధి సాధించడమే లక్ష్యం

-వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే రాందాస్ నాయక్
-భూభారతి చట్టంతో
రైతుల భూ సమస్యలన్నీ సత్వరమే పరిష్కారం
-కలెక్టర్ జితేష్ వి. పాటిల్




ప్రజాపక్షం/జూలూరుపాడు: తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ రాజ్యం పాలన కొనసాగిస్తుందని వైరా నియోజకవర్గ శాసనసభ్యులు రాందాస్ నాయక్ అన్నారు. గురువారం జూలూరుపాడు మండల కేంద్రంలో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన కార్యక్రమం లో వైరా నియోజకవర్గ శాసనసభ్యులు రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ముఖ్య అతిథులుగా హాజరై భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంతో రైతుల భూ సమస్యలన్నీ సత్వరమే పరిష్కారమవుతాయన్నారు. భూమి హక్కు పట్టాలు ఉన్న రైతులు కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. రైతుల అందరి భూములకు భూధార్ నెంబర్ కేటాయించి రైతుల భూములు హద్దులతో కూడిన చిత్రపటాన్ని పట్టాదారు పాస్ పుస్తకంలో పొందపరచునున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో భూములకు సంబంధించి ఎలాంటి వివాదాలకు తావు లేకుండా క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది విచారణ చేపట్టిన అనంతరం రైతులకు కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఇంటి స్థలాలను కూడా రికార్డుల్లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. కొత్త చట్టంతో ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనేతర రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లదని, ఈ చట్టంతో మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రభుత్వ భూముల్లో ఎన్నో ఏళ్ల నుండి సాగు చేసుకుంటున్న చిన్న, చిన్న కారు రైతులకు కూడా ఈ చట్టంతో న్యాయం జరుగుతుందన్నారు. మే నెలలో జిల్లాలోని ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని భూ సమస్యల పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. జూన్, జూలై నెలల్లో ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాదా బైనామా వారసత్వంగా వచ్చే భూములను సమగ్రంగా గ్రామాల్లో విచారణ చేపట్టి హక్కులు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సులో ఆర్డీఓ మధు, తహశీల్దార్ స్వాతి బిందు, ఎంపీడీవో కరుణాకర్ రెడ్డి, ఎఫ్ ఆర్ ఓ ప్రసాదరావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, విజయభాయి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పార్టీ మాలోత్ మంగీలాల్ నాయక్, మాజీ ఎంపీటీసీ దుద్దుకురి మధుసూదన్ రావు, నాయకులు వేల్పుల నరసింహారావు, రామిశెట్టి రాంబాబు, చౌడం నరసింహారావు, దొండపాటి వాసు తదితరులు పాల్గొన్నారు.

## వెంపటి సూర్యనారాయణకు నివాళులర్పించిన అయోధ్య



ప్రజాపక్షం/మణుగూరు: సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు వ్యవసాయ కార్మి క సంఘం జిల్లా కార్యదర్శిగా, పాల్వంచ తాలూకా కార్యదర్శిగా కూడా పనిచేసిన వెంపటి సూర్యనారాయణ బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీ కుమారి, పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి తదితరులు హాజరై సూర్యనారాయణ పార్థీవదేహాన్ని సందర్శించి, పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యనారాయణ నీతి నిజాయితీగల నాయకుడని, అనేక ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొన్నారని, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉద్యమాలకు దిక్సూచిగా పని చేశారన్నారు. వారు ఎక్కడున్నా వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారు ప్రార్థించారు.

## నడి రోడ్డులో గీతలు గీశారు.. గాలికి వదిలేశారు..



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మండలం సమితి సింగారం గ్రామంలో గల ఆర్ అండ్ బి రోడ్డు గత ప్రభుత్వం బస్సు డిపో దగ్గరనుండి బాంబే కాలనీ వరకు సెంట్రల్ లైటింగ్ అని చెప్పి భారీ యంత్రాలతో రోడ్డు మధ్యలో మూడు నాలుగు లైన్లతోని గీతాలు గీశారు అవి ఈ రోజు పెద్ద పెద్ద గోతులుగా ఏర్పడి అనేక ప్రమాదాలకు దారితీస్తున్నా... అధికారులు కానీ, ఇప్పటి ప్రభుత్వం గానీ ఈ రోడ్డు మీద శ్రద్ధ చూపడం లేదని సమితి సింగారం గ్రామ ప్రజలు, పాదాచారులు ఆరోపిస్తున్నారు. కూనవరం రైల్వే గేట్ నుండి బస్ డిపో ఎదురు వరకు రోజుకి సుమారుగా అనేక ప్రమాదాలు జరిగి చాలా లెక్కల్లో ప్రాణాలు కూడా కోల్పోయ్యారని, దీనికి తోడు వాహనదారులు మితిమీరిన వేగంతో పలుమార్లు ప్రమాదాలకు దారితీసి చాలామంది యువకులు ప్రాణాలు వదిలేశారన్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ఈ రోడ్డు మీద సెంట్రల్ లైటింగ్ సంబంధించి డివైడెర్లు కట్టడమా లేక గోతులు పూడ్చడమా రెండోవైపు డ్రైన్ కూడా నిర్మాణం చేయాలని అదేవిధంగా వాహనదారుల ట్రాఫిక్ నియంత్రణ కోసం జీబ్రా లైన్లు (వైట్ మార్క్స్)లు గాని, స్పీడ్ బ్రేకర్లు గాని ఏర్పాటు చేయగలని సమితి సింగారం గ్రామ ప్రజలు, పాదాచారులు కోరుకుంటున్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన అయోధ్య



ప్రజాపక్షం/మణుగూరు: అశ్వాపురం మండలం, మొండికుంట గ్రామ పంచా యతీ సిపిఐ పార్టీ నాయకులు బోల్కొండ అంతయ్య పద్మ దంపతుల కుమారుడు వేణు కావ్యల వివాహ రిసెప్షన్ వేడుకలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజ్ అయోధ్య పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ పినపాక నియోజకవర్గం కార్యదర్శి సైరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి యం. లక్ష్మ కుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు, సిపిఐ అశ్వాపురం మండలం కార్యదర్శి అనంతనేని సురేష్, మొండికుంట నెల్లిపాక సొసైటీ వైస్ చైర్మన్, కమటం సురేష్, మొండికుంట బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సర్వ కృష్ణ, సిపిఐ అశ్వాపురం మండలం కార్యవర్గ సభ్యులు దండి నాగేష్, దంతాల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రజాపక్షం/వైరా: వైరా వ్యవసాయ మార్కెట్ నందు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏడిఏ తుమ్మలపల్లి కరుణ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎఫ్ఏక్యూ నామ్స్ ప్రకారం రైతులు అందరూ తమ యొక్క ధాన్యాన్ని తాలు లేకుండా తేమ శాతం 17% ఉండేవిధంగా మార్కెట్‌కు తీసుకురావాల్సిందిగా సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో వైరా మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్, ఓడిసిఎంఎస్ ప్రతినిధి శివారెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారులు రాజేష్, సైదులు, పిపిసి ఇంచార్జ్ రాజు, రైతులు కామినేని రవి, బత్తుల వెంకటేశ్వర్లు, బెజవాడ నాగేశ్వరరావు, మేడిశెట్టి కృష్ణ తదితరులుపాల్గొన్నారు.

# పహల్గాం ఉగ్రదాడి అమానవీయం





**-అమాయక ప్రజలపై జరిగిన పాశవిక దాడిని ముక్తకంఠంతో ఖండించాలి**
**-జమ్మూ-కాశ్మీర్ ప్రజలకు భారత పౌరసమాజం అండగా ఉంటుంది**
**-సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** జమ్మూకాశ్మీర్ పహల్గాం యాత్రికులపై ఉగ్రవాదులు జరిగిన పాశవిక, పైశాచిక దాడి, మారణహోమం అమానవీయమని, ఈ దాడిని భారత కమ్యూనిస్టు పార్టీ కందిస్తుందని ఆ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా అన్నారు. పట్టణ పరిధిలోని రామవరం ఆటో అడ్డాలో జరిగిన కార్మికుల సమావేశం సందర్భంగా ఉగ్రదాడిలో మృతి చెందినవారికి నివాళులర్పిస్తూ మౌనం పాటించారు. అనంతరం జరిగిన సమావేశంలో సాబీర్ పాషా మాట్లాడుతూ ఉగ్రవాదులు దేశపౌరులపై కాల్పులు జరిపి హత్య చేయడం అనాగరిక చర్యని ఈ దాడిని యావత్ భారత పౌరసమాజం ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఉగ్రవాదులు కేవలం హిందువులని లక్ష్యంగా చేసుకొని కాల్చి చంపడం దేశంలో మతసామరస్యాన్ని దెబ్బతీసేందుకేనని స్పష్టమవుతోందని, ఇది ముమ్మాటికీ పిరికిపంద ఛర్యేనని స్పష్టం చేశారు. హిందూ, ముస్లింల మధ్య చిచ్చు రేపి దేశ సమైక్యతను దెబ్బతీసేందుకు పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు ఇలాంటి దుచర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దేశంలో కొందరు హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ పబ్బంగడుపుకుంటుంటే ఉగ్రవాదులు దాన్ని ఆసరాగా చేసుకొని మత చిచ్చు పెడుతున్నారన్నారు. కొద్ది రోజులక్రితం పాక్ ఆర్మిచిఎఫ్ అదేవిధంగా ఉగ్ర లష్కరే తోయిబా చీఫ్ కమాండర్ పరోక్షంగా హెచ్చరించినా కేంద్రం నిర్లక్ష్యం చేయడంవల్ల ఉగ్రదాడి జరిగిందని ఆరోపించారు. జరిగిన ఉగ్రదాడి ఇంటిలిజెన్స్ వైఫల్యమా, భద్రతా సిబ్బంది నిర్లక్ష్యమా కేంద్రమే తేల్చుకొని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా పకడ్బందీ చెర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, డిమాండ్లు, మేడే ఉత్సవాలపై చర్చించారు. సమావేశంలో ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కంచర్ల జమలయ్య, మద్రి కృష్ణ, జలీల్, శ్రీనివాస్, హాబీబి, రాఫ్ప్య, ఆనందరావు, జంజర్ల శివ, బాషా, నాగుల్ మీరా, గుబ్బల శ్రీను, యూసుఫ్, జానీ, రవీందర్, సలీం, జిలాని, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బతో మహిళ మృతి

**-నివాళులర్పించిన డా.మట్టా దయానంద్**
**-నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులు**





**ప్రజాపక్షం/సత్తుపల్లిః** రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగకు ప్రజలు విలవిలలాడిపోతున్నారు. మండుటెండలకు ఉక్కపోత కూడా తీవ్రమైంది. దీంతో జనాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన నిమ్మగడ్డ తులశమ్మ (64) గురువారం వడదెబ్బతో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తులశమ్మ గత నాలుగు రోజుల క్రితం పనులు చేస్తుండగా వడదెబ్బ తగలటంతో తీవ్ర అనారోగ్యానికి గురికాగా కుటుంబ సభ్యులు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తులశమ్మ మృతి చెందింది.

**నివాళులర్పించిన డా.మట్టా...**

ప్రజాపక్షం విలేకరి మాతృమూర్తి తులశమ్మ వడదెబ్బతో మృతి చెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ రాజీవ్ నగర్‌లోని వారి నివాసానికి చేరుకుని తులశమ్మ పార్థీవదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి ఘన నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. దయానంద్ వెంట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదే చెన్నకేశవరావు, కమల్ పాషా, షరీఫ్, ఐ శ్రీను, రామారావు, పార్థసారధి తదితరులున్నారు.

**నేత్రాలు దానం...**

తులశమ్మ నేత్రాలను లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తుపల్లి వారి ఆధ్వర్యంలో సేకరించి నేత్రనిధికి తరలించారు. తులశమ్మ నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు దయానంద్ తదితరులు అభినందించారు.

# వైరా ప్రజాపక్షం విలేకరికి పితృ వియోగం





**ప్రజాపక్షం/తల్లాడ :** ప్రజాపక్షం వైరా విలేకరి పులి కృష్ణార్జున్‌రావుకు పితృవియోగం కలిగింది. పులి కృష్ణార్జున్‌రావు తండ్రి పులి కనకదుర్గయ్య (70)మగురువారం తెల్లవారుజామున ఖమ్మంలోనిఓ ప్రయివేటు ఆసుపత్రిలో గుండెపోటుతో మరణించారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన తల్లాడ మండలం బిల్లుపాడు సమీంలో గల రామచంద్రాపురానికి తీసుకెళ్లారు. మృతదేహన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్క్ ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, సిపిఐ నాయకులు యర్రా బాబు, జమ్ముల జితేందర్‌రెడ్డి, యామాల గోపాల్‌రావు, పోటు కళావతి, ఆఫీస్ సెక్రటరీ శ్రీనివాసరావు, గారపాటి అశోక్, వైరా మాజీ శాసన సబ్యులు బాణోత్ మదన్ లాల్, కట్ల రంగారావు, కట్ల సంతోష్, అనుమకొండ రమేష్, ముళ్లపాటి సీతారాములు, కట్టా కృష్ణార్జున్‌రావు, వనమే విశ్వేశ్వరరావు, కాపా

**పలువురు నేతలు నివాళులు**

మురళీకృష్ణ, ఉంద్రు శ్యాంబాబు, చింతలపూడి వెంకటేశ్వరరావు, రాయల రాము, తుమ్మలపల్లి రమేష్, పైడిపల్లి రవి, దార్న రాజశేఖర్, కోలా శ్రీను, జాలాది రామకృష్ణ, మాదినేని దుర్గాప్రసాద్, కుప్పాల అనంతరామయ్య, మాదినేని లక్ష్మ ణ్, వైరా మున్సిపల్ కమీషనర్ చింతావేణు, ఏదులూరి సీతారాములు, ఏదులూరి శ్రీనివాసరావు, పొదిల హరినాథ్, చెరుకూరి కిరణ్, నాళ్ల రమేష్, బొర్రా సుధా, నల్లమోతు లక్ష్మీ నారాయణ, దేవుల కృష్ణయ్య, జక్కంపూడి కిషోర్, బుచ్చిరామారావు, రామప్పారవు, లాజర్, కొత్తా వెంకటేశ్వరరావు, పారుకొండ బోష్, శ్రీనివాసరెడ్డి, విలాసాగరం వెంకటేశ్వర్లు, లగడపాటి ప్రభాకర్, తోటకూర శ్రీకాంత్ పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## పులి కనకదుర్గయ్యకు ప్రజాపక్షం కన్నీటి నివాళి



**ప్రజాపక్షం/తల్లాడ :** వైరా ప్రజాపక్షం రిపోర్టర్ పులి కృష్ణార్జున్‌రావు తండ్రి పులి కనకదుర్గయ్యకు ప్రజాపక్షం విలేకర్ల బృందం కన్నీటి వీడ్కోలు పలికింది. ఆయన మృతివార్త తెలిసిన వెంటనే హుటాహుటిన కనకదుర్గయ్య మృతదేహాన్ని సందర్శించిన విలేకరులు ఘనం గా నివాళులర్పించారు. కనకదుర్గయ్య సిపిఐపార్టీలో సిద్ధాంతాలను తూచా తప్పకుండా పాటిస్తూ పార్టీ ప్రతిష్టను ఇనుమడింప చేశారని వారు కొనియాడారు. ఆయన హఠాన్మరణం కమ్యూనిజానికి తీరని లోటని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనంతరం కుటుంబ సబ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం ఉమ్మడి బ్యూరోచీఫ్ ఏనుగు వెంకటేశ్వరరావు, వైరా ఆర్సీ ఇన్‌చార్జ్ టికె ప్రసన్నన్, కొణిజర్ల , ఏన్కూర్, బోనకల్ రిపోర్టర్లు యాసా నరసింహారవు, కొవ్వూరి రామారావు, పవన్, వైరా సాక్షి సూతకాని ప్రేమ్‌చంద్, తాండ్ర రమేష్, గొల్లమందల విజయ్, కొత్తా వెంకటేశ్వరరావు, ఎగ్గిరాల శ్రీనివాసరావు, ఏపూరి రాజారావు, లక్కిశెట్టి రవితేజ, దాసరి శ్రీనివాసరావు, మేరుగు కృష్ణ, చింతల వసంతరావు, సాగర్‌రెడ్డి, చెర్రి, మస్తాన్, ఈవూరి నరసింహారావు, కూరాకుల రామారావు, పోశం శ్యామ్, బుచ్చి రామారావు, డేవిడ్ , ఐన్యూస్ రవి తదితరులు ఉన్నారు.

## పులి కనకదుర్గయ్యకు ఘన నివాళులు



**ప్రజాపక్షం/వైరాః** లయన్స్‌క్లబ్ సభ్యులు పులి కృష్ణార్జున్‌రావు తండ్రి పులి కనకదుర్గయ్య గురువారం ఉదయం ఆకస్మికంగా మరణించారు. విషయం తెలుసుకున్న ఆయన స్వగ్రామమైన రామచంద్రాపురంలో ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, లయన్స్ సభ్యులు ఘనంగా నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులు అర్పించిన వారిలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు చింతలపూడి వెంకటేశ్వరరావు, గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షులు తోటకూర శ్రీకాంత్, కిషన్‌రాయి, సూతకాని జైపాల్, ముళ్ళపాటి సీతారాములు, వుంద్రు శ్యామ్ బాబు, లగడపాటి ప్రభాకర్‌రావు, వనమా విశ్వేశ్వరరావు, కట్టా కృష్ణార్జున్‌రావు, డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి, పెనుగొండ ఉపేందర్‌రావు, ఏడునూతల బుచ్చిరామారావు, మాదినేని దుర్గాప్రసాద్, నల్లమోతు లక్ష్మీ నారాయణ, పుప్పాల అనంతరామయ్య, ఏపూరి రాజారావు, వెన్నపూస వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్డ్స్ సర్వేయర్స్ నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఖమ్మంజిల్లా లైసెన్డ్స్ సర్వేయర్స్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గురువారం ఖమ్మంలో రాష్ట్ర కమిటీ సమక్షంలో రాష్ట్ర అధ్యక్షులు ఎం. వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉమ్మడి ఖమ్మంజిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బొడ్డుపల్లి హరికృష్ణ, ఉపాధ్యక్షులుగా అంబటి మాధవరావు, జనరల్ సెక్రటరీగా దండు భాస్కర్‌రావు, సభ్యులుగా భద్రయ్య, శేఖర్, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, హేమంత్, వీరబాబు, రవితేజ, కృష్ణ, గోపాలచారి, జగన్‌మోహన్ ప్రసాద్, నాగరాజు, వెంకటేశ్వరరావు తదితరులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ ఆధ్వర్యంలో లైసెన్డ్స్ సర్వేయర్స్ యొక్క సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు వారు తెలిపారు. నూతనంగా ఎన్నికైన వారికి పలువురు అభినందనలు తెలిపారు.

# నాణ్యమైన ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలి



-ఎండ లేని సమయాల్లోనే కాంటా వేయాలి
-ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన రాష్ట్ర బృందం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ధాన్యం కొనుగోలుపై రాష్ట్ర బృందం, ఐకెపి, ప్యాక్స్, డిసిఎంఎస్, మెప్మా, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. పౌర సరఫరాల కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన రాష్ట్ర బృందం కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను, నేలకొండపల్లి మండలంలో అరుణాచల రైస్‌మిల్లును తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు రికార్డును పరిశీలించి ప్రభుత్వం సూచించినవిధంగా నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని, కొనుగోళ్లలో సీరియల్ నెంబర్ పాటించాలని, కాంటా వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు నిర్దేశించిన రైసు మిల్లులకు తరలించాలన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున వృద్ధులను ఎవరిని కొనుగోలు కేంద్రాల వద్ద ఉంచకూడదని ఎండ లేని సమయాల్లోనే కాంటా వేయాలని రైతులకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్ అందుబాటులో ఉంచాలని సూచించారు. రైసుమిల్లుల వద్ద కొనుగోలు కేంద్రం నుంచి వచ్చిన ధాన్యం త్వరిత గతిన అన్‌లోడ్ చేసి ఓపిఎంఎస్‌లో అప్‌డేట్ చేసుకోవాలని ప్రభుత్వానికి చెల్లించాల్సిన బియ్యం మే నెల వరకు చెల్లించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు రైతుల వద్ద నుంచి 29,695 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని జిల్లాలో 799 మంది రైతుల నుంచి 6,165 క్వింటాళ్ల సన్నరకం ధాన్యం కొనుగోలు చేసి రూ. 3.08 కోట్లు బోనస్ రూపంలో చెల్లించామన్నారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల డిప్యూటీ కమిషనర్ కొండలరావు, జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు, జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ శ్రీలత, డిప్యూటీ తహసీల్దార్ (సిఎస్), ఖమ్మం రూరల్, నేలకొండపల్లి సిఎస్, ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

# సర్వే చేసి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం..




- సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా
- ఏదులాపురం మున్సిపాలిటీలో జాతీయ ఉపాధి హామీని కొనసాగించాలి: దండి సురేష్

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏదులాపురం మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై సిపిఐ ఆధ్వర్యంలో సర్వే చేసి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా అన్నారు. గురువారం ఖమ్మంనరగంలోని బైపాస్‌రోడ్డులో గల గిరిప్రసాద్‌భవన్‌లో ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని సిపిఐ పార్టీ ఆధ్వరయలో సమావేశాన్ని సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఉన్నం రంగారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మౌలానా మాట్లాడుతూ...ఈ ప్రాంతంలో పేదలు గూడు లేక అవస్థలు పడుతున్నారు అంతేకాకుండా ఒకటి,రెండు గదులలో రెండు మూడు కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. అలాగే కిరాయి ఇళ్లల్లో ఉంటూ ఆర్థిక భారంతో సతమతం అవుతున్నట్లు పేర్కొన్నారు. కావున ప్రభుత్వం ప్రకటించి విధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ నిర్మించాల్సిందిగా కోరారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు దండి సురేష్ మాట్లాడుతూ...మున్సిపాలిటీ నేపథ్యంలో జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కోల్పోవడంతో పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఇందులో భాగంగా పలువురు సిపిఐ కార్యకర్తలు మాట్లాడుతూ...సిపిఐకాంగ్రెస్ పొత్తు ధర్మాన్ని కొందరు కాంగ్రెస్ నాయకులు పాటించడం లేదని సభ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, అజ్మీరా రామ్మూర్తి నాయక్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు యడ్లపల్లి శంకరయ్య, చెరుకుపల్లి భాస్కర్, పగిళ్ల వీరభద్రం, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోటా రామాంజనేయులు, బికేఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, గిరిజన సంఘం నాయకులు పాల్తీయా శ్రీను, ఏఐవైఎఫ్ పాలేరునియోజకవర్గ ఉపాధ్యక్షుడు మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, నేతలు, కార్యకర్తలు, యువజన సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రశాంతి ఆసుపత్రికి ఐఎస్‌వో, ఎన్ఏబిహెచ్ గుర్తింపు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని ప్రశాంతి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ఐఎస్‌వో, ఎన్ఏబిహెచ్ (నేషనల్ అక్రిడేషన్ బోర్డు ఫర్ హాస్పటల్స్ అండ్ హెల్త్ కేర్ ప్రోవైడర్స్) గుర్తింపు పొందినట్లు ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ కేసోజు భరత్ బాబు గురువారం తెలిపారు. ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, నల్లగొండ, కృష్ణా జిల్లాలతో పాటు ఉమ్మడి రాష్ట్రంలోనే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందిస్తూ పేద, మధ్య తరగతి ప్రజలకు అత్యాధునీక వైద్యం తక్కువ ఖర్చుతో అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. తక్కువ ఫీజుతో నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్న యజమాన్యాన్ని ఐఎస్‌వో డైరెక్టర్ అభినందిస్తూ భవిష్యత్తులో కూడా అత్యుత్తమ వైద్య సేవలను అందించాలని తెలిపినట్లు భరత్‌బాబు తెలిపారు. నిజాయితీ, నిబద్ధత గల వైద్యుల పర్యవేక్షణలో నాణ్యమైన వైద్యం అందిస్తుండడంతో ప్రశాంతికి అరుదైన గౌరవం లభించిందని ఆయన తెలిపారు. ఐఎస్‌వో, ఎన్ఏబిహెచ్ గుర్తింపు పొందడం పట్ల ప్రశాంతి ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ భరత్‌బాబు తో పాటు వైద్యులకు పలువురు పుర ప్రముఖులు, వైద్యులు అభినందనలు తెలిపారు. ఆసుపత్రి వద్ద ఐఎస్‌వో గుర్తింపు లభించడంతో సంబురాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైద్యులు భాస్కర్, బసవయ్య చౌదరి, కృష్ణ ప్రసాద్, హేమంత్, రాజ్‌కుమార్, జీవన్‌కుమార్, మధుసూదన్ పాల్గొన్నారు.




# చెల్లని చెక్కు కేసులో ఆరునెలల జైలు

**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** చెల్లని చెక్కు కేసులో నిందితునికి ఆరు నెలల జైలుశిక్షతో పాటు చెక్కుకు సంబంధించిన మొత్తం ధనం చెల్లించాలని ఖమ్మం రెండవ అదనపు ప్రథమశ్రేణి న్యాయాధికారి వై. బిందుప్రియ గురువారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే... ఖమ్మం పట్టణం ద్వారకానగర్‌కు చెందిన పెంట్యాల వాసు వద్ద ఖమ్మం పట్టణం చెందిన గడ్డం ధనుంజయ 2016 డిసెంబర్ 25న ఐదు లక్షలు అప్పు తీసుకున్నాడు. అదే రోజు ప్రాంసరీ నోటు రాసిచ్చాడు. 2018న ఐదు లక్షల రూపాయలకు చెక్కు ఇవ్వగా బ్యాంకు ఖాతాలో సరిపడ నగదు లేకపోవడంతో తిరస్కరణకు గురైంది. బాధితుడు వాసు మందడపు శ్రీనివాసరావు న్యాయవాది ద్వారా కోర్టును ఆశ్రయించాడు. కోర్టులో నిందితునికి ఆరునెలల జైలుతో పాటు చెక్కుకు సంబంధించిన మొత్తం ధనాన్ని చెల్లించాలని తీర్పునిచ్చారు.

# కుక్కలదాడిలో 12గొర్రెలు మృతి





**ప్రజాపక్షం/చంద్రుగొండ:** అర్ధరాత్రి కుక్కల దాడిలో 12గొర్రెలు మృతి చెందిన ససంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్లగా ..చంద్రుగొండ మండల పరిధిలోని రావికంపాడు గ్రామానికి చెందిన ఆసంగి పెద్దపకీర్‌కు చెందిన గొర్రెలకు ఇంటికకి దూరంగా ఉన్న దొడ్లో ఉంచగా తెల్లవారుజామున గ్రామానికి చెందిన కుక్కలగుంపు దాడి చేయగా 12గొర్రెలు మృతి చెందాయి. అదిచూసిన పెద్దపకీర్ చూసి సుమారు రూ.2లక్షలు విలువచేసే గొర్రెలు చనిపోవడంతో కన్నీరుమున్నీరయ్యారు. కుక్కలదాడిలో చనిపోయి నష్టపోయిన రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

# శ్రీసిటీలో ఓ వీధికి జవాన్ పేరు నామకరణం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని శ్రీసిటీలో అమరుడు ఎక్స్ జవాన్ భూక్య రమేష్ పేరుపై ఓ వీధికి గురువారం నామకరణం చేశారు. కుటుంబ సభ్యులు జవాన్ పేరుకై ఉన్నత స్థాయి అధికారులను కోరిన అనుమతుల మేరకు లభించాయి. ఇందులో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటి చైర్మన్ గరికపాటి వెంకట్రావు, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ భైరు హరినాథ్‌బాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కళ్లెం వెంకట్‌రెడ్డి, నాయకులు పల్లెర్ల పాండయ్య, ఆర్మీ ఉన్నత స్థాయి అధికారులు, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

# నూనె గింజల సాగును ప్రోత్సహించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో నూనెగింజల సాగును ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం నూనెగింజల మిషన్ జిల్లా స్థాయి కమిటీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 202526 ఆర్థిక సం.కుగానూ నూనెగింజలు వేరుశనగ, సన్‌ఫ్లవర్, నువ్వులు తదితరాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో నూనెగింజల సాగు విస్తీర్ణం పెంచి అధిక దిగుబుడులు సాధించి రైతులు ఆర్థికాభివృద్ధి చెందాలా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సాగును ఇతర పంటలసాగుతో మార్పిడి చేయడం ద్వారా భూమిని కూడా సారవంతం చేయవచ్చన్నారు. దీనిపై కూడా అవగాహన కల్పించాలన్నారు. సాగుకు వ్యయం తక్కువ ఉండటంతో పాటు చీడపీడలు ఆశించే అవకాశం చాలా తక్కువని, ఈ సాగు అన్ని విధాలా లాభదాయకం అన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయాధికారి బాబూరావు, అధ్యానశాఖాధికారి కిషోర్‌బాబు, కేవికే శాస్త్రవేత్త నారాయణమ్మ, లీడ్‌బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.